

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్వర్గం

**చంటికి భయంగా ఉంది.** దుఃఖంగా ఉంది.

'ఛ! అంతా నా మూలంగానే!' పదోసారి అనుకున్నాడు.

"అత్తయ్య దగ్గరకి వెళ్తాను" అని అమ్మా నాన్నలని వేధించి, ఆ వేసవి సెలవులకి మ్రరిపూడి నుంచి హైదరాబాద్ వచ్చిన చంటికి అన్నీ వింతలే! పెద్ద పెద్ద బిల్డింగ్స్, కార్లు, స్కూటర్లు నడిపే అమ్మాయిలు, డబుల్ డెక్కర్ బస్‌లు, మ్రరిపూడి కన్నా చల్లగా ఉన్న వాతావరణం.. వాడికి హైదరాబాదు భలే నచ్చేసింది. బ్లాక్ అండ్ వైట్ టెలివిజన్ అదనపు ఆకర్షణ.

అత్తయ్య వాళ్ళిల్లు తమ ఇల్లంత పెద్దది కాకపోయినా వివరంగా ఉంది. రెండు బెడ్‌రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, ముందు చిన్న వరండా. అది మామయ్యకి ఆఫీస్ వాళ్ళిచ్చిన ఇల్లట! క్వార్టర్ అంటారని రవి చెప్పాడు. తన వయసే ఉన్న రవికి ఆ కాలనీ అంతా ఫ్రెండ్సే. కాకపోతే వాళ్ళు ఆడే క్రికెట్ ఆట చంటికి అంతగా నచ్చలేదు. రవి చెల్లెలు అమ్ములుతో కూర్చుని దాని బొమ్మలతో ఆడుకోసాగాడు.

ఆ శనివారం మధ్యాహ్నం అర్థంకాకపోయినా టీవీలో హిందీ కార్యక్రమం చూస్తున్న చంటి, మామయ్యకి భోజనం వడ్డిస్తున్న అత్తయ్య కొంగుపట్టుకుని అడిగాడు.

"అత్తా! నన్ను జూకి తీసుకెళ్తావా? అక్కడ పులులు, సింహాలు ఉంటాయట కదా? నేనెప్పుడూ వాటిని చూడలేదు."

"అలాగేరా. రేపు ఆదివారం వెళ్దాంలే" అత్తయ్య అభయమిచ్చింది.

"నా దగ్గర డబ్బుల్లేవు. అసలే నెలాఖరు రోజులు. ఫస్ట్ వీక్‌లో పోదాంలే, వీడింకా నెలరోజులు ఉంటాడుగా." మామయ్య చెయ్యి కడుక్కుంటూ చెప్పాడు.

"నా దగ్గరున్నాయి. అన్నయ్య బాపట్ల ఇంటి అద్దె పంపాడు." అత్తయ్య టేబుల్ మీది కంచం తీస్తూ చెప్పింది.

ఆ మాటల్లో తప్పేం ఉందో చంటికి అర్థం కాలేదు కానీ మామయ్య ఉగ్రనరసింహం అవతారమెత్తాడు.

"అంటే? నేను డబ్బుల్లేని దరిద్రుడ్ని. నువ్వు డబ్బున్న మహారాణివా? ఈ ఆడవాళ్ళకి స్వంత డబ్బు అని ప్రత్యేకంగా ఉంటే చాలు. పొగరు నెత్తికెక్కుతుంది.." గొంతు చించుకుని అరవసాగాడు. అత్తయ్య మాట్లాడకుండా టేబుల్ శుభ్రం చేస్తూంటే, మామయ్య రెచ్చిపోయాడు.

"నా మానాన నేను అరుస్తూనే ఉన్నాను. 'అరుచుకోరా వెధవా' అన్నట్లు నువ్వు నవ్వుతావేంటి?" గద్దించాడు.

"రామ రామ! నేనెప్పుడు నవ్వాను?" అత్తయ్య తెల్లబోయింది.

"నాకు తెలుసు నీ వేషాలు. మొగుడి మాటంటే లక్ష్యంలేదు. ఇలాంటి కొంపలో ఉండటం కంటే సన్యాసుల్లో కలిసిపోతే నయం పుణ్యం పురుషార్ధమైనా దక్కుతాయి" మామయ్య మేకుకి తగిలించి ఉన్న చొక్కాని లాగి, వేసుకుని గుండీలు పెట్టుకుంటూ విసురుగా బయటకి వెళ్ళిపోయాడు.

చంటికి ఏం చేయాలో అర్ధంకాలేదు. వాడి కళ్ళు రెండూ నీటితో నిండిపోయాయి. నెమ్మదిగా ఇంటి ముందున్న పార్క్‌లోకి వచ్చాడు. రవి క్రికెట్ ఆడుతున్నాడు. వాడి దగ్గరకి వెళ్ళి దుఃఖంగా చెప్పాడు.

"ఒరే రవీ! మామయ్య ఇంట్లోంచి వెళ్ళిపోయాడురా."

"కృష్ణారావు అంకుల్ ఇంటికి పేకాట ఆడటానికి వెళ్ళుంటాడు. నీకు ఆయనతో ఏంపని?" కేచ్ పట్టుకోడానికి ఆకాశంలోకి చూస్తున్న రవి చిరాగ్గా అడిగాడు.

"కాదురా. మామయ్య సన్యాసుల్లో..." దుఃఖంతో వాడిగొంతు పూడుకుపోయింది.

బంతి రవి తలమీంచి దూసుకెళ్ళి గీత అవతల పడింది. కృద్ధుడైన రవి పెద్దగా అరిచాడు.

"ఒరే చంటీ. నువ్వెళ్ళి అమ్మలుతో అమ్మాయిల బొమ్మలాడుకో. నీ మూలంగా బంగారం లాంటి కేచ్ మిస్సయింది."

చేసేది లేక చంటి ఇంటికి తిరిగివచ్చాడు. అత్తయ్య వంటింట్లో ఏదో పనిచేసుకుంటోంది. అమ్మలు బొమ్మలకి అన్నం కూరలు తినిపించడంలో బిజీగా ఉంది. దాని పక్కన కూర్చుని విచారంగా చెప్పాడు.

"అమ్మలూ మామయ్య సన్యాసుల్లో కలవడానికి వెళ్ళిపోయాడు."

అర్ధంకాని అమ్మలు తలెత్తి నవ్వింది.

"అంతా నామూలంగానే. మానాన్న హైదరాబాద్ బస్ ఎక్కించేప్పుడు వందసార్లు చెప్పాడు. అత్తయ్య మామయ్యలని విసిగించద్దురా అని. టీవీలో పులిని చూస్తే నిజం పులిని చూడాలనిపించింది. అందుకే జూకి తీసుకెళ్ళమని అత్తని అడిగాను." వాడి కళ్ళల్లోంచి కన్నీళ్ళు ధారగాకారసాగాయి.

"ఆకలేస్తోందా? అన్నం పెట్టనా?" అమ్మలు జాలిగా చూస్తూ అడిగింది.

వాడి అరచేతిని చాపి ఇది అన్నం, ఇది పప్పు, ఇది నెయ్యి అని ఉత్తుత్తి వడ్డన చేయసాగింది.

వాడు అక్కడనుంచి లేచి అత్తయ్య దగ్గరకి వచ్చాడు. ఆవిడ ఆరిన బట్టలు మడతలు పెడుతోంది. నిశ్శబ్దంగా మళ్ళీ బయటకి వచ్చి ఇంటిముందున్న పార్క్‌లో వచ్చేపోయేవాళ్ళని చూస్తూ కూర్చున్నాడు. వాడికి సన్యాసులంటే ఏమిటో బాగా తెలుసు. కాషాయ దుస్తుల్లో మామయ్యని ఊహించుకుంటే వాడి దిగులు పెరిగిపోయింది.

"ఏంరా అన్నం సరిగ్గా తినడంలేదు? ఇంటిమీద దిగులొచ్చిందా?" ఆ రాత్రి అన్యమనస్కంగా అన్నం తింటున్న చంటిని అత్తయ్య ప్రశ్నించింది.

"అత్తా! మామయ్య ఇంకా రాలేదే?" వాడు బేలగా అడిగాడు.

"వస్తారులేరా. ఇంకొంచెం అన్నం పెట్టుకుని మజ్జిగ పోసుకో" ఆవిడ అన్నం వడ్డించింది.

ఆ రాత్రి చాలా సేపటిదాకా చంటికి నిద్రపట్టలేదు. ఏ చిన్న చప్పుడైనా మామయ్య వచ్చాడేమో అని ఆత్రంగా చూసాడు కానీ రాలేదు. పక్కన నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్న రవిని చూస్తే ఏడుపు ముంచుకొచ్చింది. అలాగే ఏడుస్తూ నిద్రపోయాడు.

"ఇంక చాలు. వద్దు.. పోనీ సగం వెయ్యి." మామయ్య గొంతు విని ఒక్క ఉదుటన లేచి బయటకి వచ్చాడు. అత్తయ్య వేస్తున్న పెసరట్లని తింటున్న మామయ్య వాడిని చూసి నవ్వి చెప్పాడు.

"అప్పుడే లేచావేంట్రా? వాళ్ళిద్దర్నీ కూడా లేపు. జూకి వెళ్దాం."

చంటి మామయ్యని వెనకనుంచి వాటేసుకుని చెప్పాడు ఆనందంగా, "ఫస్ట్‌వీక్‌లో వెళ్దాంలే. పులులు సింహాలు ఎక్కడికీ పోవు."

మామయ్య ఎంగిలి చేత్తో వాడి చెంపమీద చిన్నగా చరిచి చెప్పాడు "పెద్దమనిషిలాగా నీకు బడ్జెట్ గొడవలు ఎందుకురా? పో పోయి రవిని లేపు."

చంటి గంతులువేస్తూ రవి దగ్గరకి వెళ్ళాడు సంతోషంగా.

"ఒరేయ్ చంటీ! జుట్టు చూడు ఎట్లా ఎర్రగా అయిందో. నూనె రాస్తా రా." నాలుగు రోజుల తర్వాత ఓ మధ్యాహ్నం అత్తయ్య వాడిని పిలిచింది.

బుద్ధిగా ఆవిడ ముందు కూర్చుని నూనె రాయించుకుంటూ చంటి చెప్పాడు. "అత్తా! మొన్న ఎంత భయపడ్డానో తెలుసా?"

"పులులని చూసా? అవి బోనులోనే ఉంటాయిరా. బయటకి రావు."

"పులులు కాదత్తా మామయ్య సన్యాసుల్లో కలుస్తానని వెళ్ళారే. అప్పుడు."

"ఓరీ! నీకు సన్యాసులంటే తెలుసా?" అత్తయ్య ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ! తెలుసు. మర్రిపూడిలో మనింటికి అడుక్కోడానికి వస్తారు. వాళ్ళకి ఇల్లూ, వాకిలి ఏవీ ఉండవు. వచ్చినప్పుడల్లా బియ్యం వేయాలని నాన్న నాకు చెప్పాడు. నా మూలంగా మామయ్య కూడా ఇల్లూ వాకిలి లేకుండా..." వాడికి దుఃఖం ముంచుకు వచ్చింది.

అత్తయ్య వాడిని ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని నూనె చేతులని వాడి కాళ్ళూ, చేతులకి రాస్తూ చెప్పింది. "ఒరే చంటీ ఒక్క విషయం గుర్తుంచుకో. ఏ మగవాడు ఇంట్లోంచి వెళ్ళిపోయి సన్యాసి కాడు."

"ఎందుకత్తా? కానీ మన ఊళ్ళో...." వాడు ఏదో చెప్పబోయాడు.

"వాళ్ళ విషయం వేరు నాన్నా! మామయ్య, మీ నాన్నలాంటి వాళ్ళకి ఇల్లు స్వర్గం లాంటిది. శుభ్రమైన బట్టలు, రుచికరమైన భోజనం, మెత్తటి పడక, ముత్యాల్లాంటి పిల్లలు, అవసరాలు చూసే పెళ్ళాం.. ఈ స్వర్గాన్నీ, ఈ దేవేంద్రభోగాలని వదిలి ఏ మగాడూ వెళ్ళలేడు. కోపం వచ్చి బయటకి ఎవరింటికైనా వెళ్తే ఎంతసేపు ఉంటాడు? కాఫీ తాగి కబుర్లు చెప్తూ కూర్చుంటే, వాళ్ళే కొద్దిసేపటికి సాగనంపుతారు. పక్షులు సాయంకాలానికి గూళ్ళు చేరినట్లు మగాడు పగలంతా ఎక్కడ తిరిగినా రాత్రయ్యేసరికి ఇంటికి రావాల్సిందే కాకపోతే అహం దెబ్బతిన్నప్పుడల్లా అరిచి అలిగిపోతూంటాడు. ఆ తిక్క తగ్గాక వచ్చేది ఇంటికే. వెర్రినాగన్నా. అనవసరంగా భయపడ్డావు" ఆవిడ ఆప్యాయంగా వాడి నుదిటిమీద ముద్దుపెట్టుకుంది.

అమ్మలు మీద అలిగి హేంగర్‌కి ఉన్న షర్ట్‌ని వేసుకునేటప్పుడల్లా చంటి అనబడే రామ్‌ప్రసాద్‌కి ముప్పై ఐదేళ్ళనాటి ఆ సంఘటన జ్ఞాపకం వస్తుంది. ఆ జ్ఞాపకం పెదవుల మీదకి చిరునవ్వుని తెప్పిస్తుంది. మగాళ్ళమెడకి ఆడవాళ్ళు కనబడని కట్టుతాళ్ళు వేస్తారు అని ప్రతిసారీ నవ్వుకుంటాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story